# న్యూస్ ఇండియా తెలుగు

NEWS INDIA TELUGU Telugu daily

తెలుగు దినపత్రిక

సంపుటి : 5 | సంచిక :174 | ప్రచురణ : హైదరాబాద్ | బుధవారం,6-05-2026 | పేజీలు: 8 | వెల : 3- 00


## రేపు తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ ప్రమాణస్వీకారం!



- విజయ్‌తో పాటు తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశం
- టీవీకే ప్రభుత్వం ఏర్పాటుకు మరో 10 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం
- డీఎంకే నేతృత్వంలోని కూటమిలో గల మిగిలిన పార్టీలతో టీవీకే చర్చించే అవకాశం

234 మంది సభ్యులున్న తమిళనాడు అసెంబ్లీలో విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీ 108 సీట్లతో ద్రవిడ పార్టీలను మట్టికరిపించింది. టీవీకే శాసనసభా పక్షం ఈరోజు సమావేశమై విజయ్‌ను తమ నాయకుడిగా ఎన్నుకుంది. విజయ్ తమిళనాడు ముఖ్యమంత్రిగా (మే 7వ తేదీన) ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉంది. ఆయనతో పాటు తొమ్మిది మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేస్తారని తెలుస్తోంది. ఈ మేరకు విజయ్ రేపు గవర్నర్ ను కలిసి ప్రభుత్వ ఏర్పాటుపై చర్చించనున్నారు. టీవీకే పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి మరో 10 మంది ఎమ్మెల్యేలు అవసరం. ఈ నేపథ్యంలో ఈరోజు జరిగిన శాసనసభా పక్ష సమావేశంలో ఎవరితో పొత్తు పెట్టుకోవాలనే అంశంపై కూడా చర్చించారు. సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి టీవీకే నాయకులు వివిధ పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్‌తో పాటు ఇతర చిన్న పార్టీలతో టీవీకే చేతులుకలిపి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన సంఖ్యాబలాన్ని సమకూర్చుకోవడానికి కాంగ్రెస్, వామపక్షాలతో పాటు ఐయూఎంఎల్, వీసీకే వంటి చిన్నపార్టీలతో చర్చలు జరపనున్నట్లు తెలుస్తోంది. ఈ పార్టీలకు త్వరలో ఆహ్వానాలు పంపించవచ్చని జాతీయ మీడియాలో కథనాలు వస్తున్నాయి. ఇక్కడ ఆసక్తికర అంశం ఏమంటే, కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఐ(ఎం), ఐయూఎంఎల్ పార్టీలు ప్రస్తుతం డీఎంకే నేతృత్వంలోని సెక్యులర్ ప్రోగ్రెసివ్ అలయన్స్ (ఎస్పీఏ)లో భాగస్వాములుగా ఉన్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఐదు, ఐయూఎంఎల్, సీపీఐ, సీపీఐ(ఎం), వీసీకే రెండు సీట్ల చొప్పున గెలుచుకున్నాయి. కాంగ్రెస్ సహా ఈ పార్టీలు టీవీకేతో జతకడితే విజయ్ సునాయాసంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చు. అయితే, వీసీకే, వామపక్షాలు తమ నుంచి విడిపోయి టీవీకే పార్టీతో కలవవని డీఎంకే ధీమా వ్యక్తం చేస్తోంది.

## నేడు ఢిల్లీకి వెళుతున్న రేవంత్ రెడ్డి

- మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టు అనుమతులపై దృష్టి సారించనున్న సీఎం
- కాంగ్రెస్ పెద్దలను కలవనున్న రేవంత్
- కేరళలో యూడీఎఫ్ విజయం నేపథ్యంలో రేవంత్ పర్యటనకు మరింత ప్రాధాన్యత



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రేపు ఉదయం ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటనలో ప్రధానంగా హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ప్రాజెక్టుకు అవసరమైన కేంద్ర అనుమతులపై ఆయన దృష్టి సారించనున్నట్టు సమాచారం. ఢిల్లీలో పలువురు కేంద్ర మంత్రులతో భేటీ అయి, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పెండింగ్ ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలకు అందాల్సిన నిధులపై విజ్ఞప్తులు చేయనున్నారు. పాలనాపరమైన అంశాలతో పాటు, ఏఐసీసీ అగ్రనేతలతో కూడా ముఖ్యమంత్రి సమావేశం కాబోతున్నారు.కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ సాధించిన అఖండ విజయం ఈ పర్యటనకు మరింత ప్రాధాన్యతను చేకూర్చింది. కేరళ ఎన్నికల ప్రచారంలో రేవంత్ రెడ్డి కీలక పాత్ర పోషించి, కూటమి విజయంలో తనవంతు కృషి చేశారు. ప్రస్తుతం కేరళ ముఖ్యమంత్రి ఎవరనే ఉత్కంఠ కొనసాగుతుండగా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ పేరు రేసులో బలంగా వినిపిస్తోంది. రేవంత్ రెడ్డికి, వేణుగోపాల్‌తో ఉన్న సన్నిహిత సంబంధాల నేపథ్యంలో, ఈ ఢిల్లీ పర్యటనలో కేరళ రాజకీయ సమీకరణాలపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది.

## రేవంత్ ఇచ్చిన హామీలకు.. ఇప్పుడు చేస్తున్న పనులకు పొంతన లేదు

- ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్న ఈటల
- బిల్లులు అందక కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన
- మమత అహంకారానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని వ్యాఖ్య



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలకు, ప్రస్తుతం ఆయన చేస్తున్న పనులకు ఏమాత్రం పొంతన లేదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శించారు. గజ్వేల్‌లో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ప్రయోజనాలు కల్పించడంలో, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. చివరికి న్యాయస్థానాలు జోక్యం చేసుకుని ప్రభుత్వాన్ని ప్రశ్నించే స్థాయికి పరిస్థితి దిగజారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు అందక వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అధికారంలోకి వచ్చిన రెండేళ్లకే కాంగ్రెస్ పార్టీ ప్రజల చేత ఛీత్కరించుకునే స్థితికి చేరుకుందని ధ్వజమెత్తారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ అహంకారానికి ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పారని, తమిళనాడులో స్టాలిన్ వంటి బలమైన నేతపై ఒక సామాన్యుడు గెలిచాడంటే అక్కడి ప్రభుత్వాలపై ఎంత వ్యతిరేకత ఉందో అర్థమవుతుందని విశ్లేషించారు. కుటుంబ రాజకీయాలు చేస్తూ, రాష్ట్రాన్ని తమ జాగీరుగా భావించే వారికి తమిళనాడు ఫలితాలు ఒక హెచ్చరిక అని పేర్కొన్నారు. అవినీతి సొమ్ముతో ఎన్నికల్లో గెలవాలనుకునే వారికి ఈ ఫలితాలు కనువిప్పు కావాలని... తెలంగాణ బాగుపడాలంటే బీజేపీ అధికారంలోకి రావడమే ఏకైక మార్గమని ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

## హైదరాబాద్ ORR పై 33 శాతం యాక్సిడెంట్స్‌కు కారణం నిద్రమత్తే !





హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్‌పై భద్రత కట్టుదిట్టం చేయాలని అధికారుల కీలక నిర్ణయం తీసుకున్నారు. 2026 మే 05వ తేదీన హైద్రాబాద్ సీపీ వీసీ సజ్జనర్ అధ్యక్షతన ఉన్నత స్థాయి సమన్వయ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు.

ఓఆర్ఆర్‌పై రోజుకు సుమారు 2.8 లక్షల వాహనాల రాకపోకలు సాగిస్తున్నట్లు ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. రోజుకు సగటున 5-6 ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలను సున్నాకి తగ్గించాలని ఋ సందర్భంగా సీపీ సజ్జనార్ అధికారులకు సూచించారు.ఓఆర్ఆర్ పై జరుగుతున్న ప్రమాదాలకు ప్రధాన కారణాలు గుర్తించారు అధికారులు.

**యాక్సిడెంట్స్ కు ప్రధాన కారణాలు:**

**నిద్రమత్తు - 33%**

**నిర్లక్ష్య డ్రైవింగ్ - 25%**

**అతివేగం - 15%**

**టైర్లు పేలడం - 14%**

వాహనదారులకు మొబైల్ ద్వారా సేఫ్టీ అలర్ట్స్ పంపించే ప్లాన్ చేస్తున్నట్లు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి పోలీసులు కౌన్సెలింగ్ ఇవ్వనున్నారు. ఓఆర్ఆర్‌పై అనవసరంగా వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎమర్జెన్సీ సమయంలో రెస్పాన్స్ టైమ్ తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

అవసరమైతే ట్రాఫిక్ మార్షల్స్ సేవలు వినియోగించుకునేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇకనుంచి వాహనాల ఫిట్‌నెస్, టైర్ల నాణ్యతపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నారు. ప్రతి నెలా రోడ్ సేఫ్టీపై సమీక్షా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ముందస్తు జాగ్రత్తలే ప్రాణాలను కాపాడతాయనే మెసేజ్ వాహనదారుల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా నిర్ణయించారు.

## అధిక వేడి, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న తెలంగాణ ప్రజలకు కాస్త ఊరట



తెలంగాణలో అధిక ఉష్ణోగ్రతలతో ప్రజలు అల్లాడుతున్నారు. సాయంత్రం దాకా ఎండ, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం ఏడు గంటలకే ఎండ తీక్షణంగా కాస్తోంది. కాగా, క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో తెలంగాణలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఒక డిగ్రీ మేర తగ్గాయి. రానున్న రెండు మూడు రోజుల్లో ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు తగ్గే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.ఈ నెల 8వ తేదీ నుంచి మళ్లీ క్రమంగా ఉష్ణోగ్రతలు పెరగనున్నట్లు తెలిపారు. ఈరోజు, రేపు, ఎల్లుండి క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, మహబూబ్ నగర్ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

## మమతా బెనర్జీ, రాహుల్ గాంధీ గతంలో ఓట్ చోరీ చేసే గెలిచారా?: తెలంగాణ బీజేపీ చీఫ్ ప్రశ్న




మమతా బెనర్జీ, రాహుల్ గాంధీలు గతంలో ఓట్ చోరీ చేసే ఎన్నికల్లో గెలిచారా? అని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు ప్రశ్నించారు. ఈరోజు హైదరాబాద్‌లో ఆయన మాట్లాడుతూ, యావత్ ప్రపంచం ఆర్థికమాంద్యంలో కొట్టుమిట్టాడుతుంటే మోదీ ఆధ్వర్యంలో భారతదేశం ప్రగతి పథంపై పరుగులు పెడుతోందని అన్నారు. ఈ నెల 10వ తేదీన రాష్ట్రానికి వస్తున్న ప్రధాని మోదీకి ప్రజలు ఘన స్వాగతం పలకాలని కోరారు. బెంగాల్‌లో 100 సీట్లలో ఓటు చోరీ జరిగిందని మమతా బెనర్జీ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని అన్నారు. వీళ్లకు ఓటు చోరీ అలవాటు కాబట్టే అప్పుడు గెలిచారని చురక అంటించారు. ఎన్నికల్లో ఓడిపోతే ప్రజల తీర్పును అంగీకరించాలని, కానీ ప్రజలను అవమానపరిచే మాటలు సరికాదని అన్నారు.

# బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధి నిజాంపేట్లో అగ్నిప్రమాదం

## 6 ఫర్నిచర్ దుకాణాలు పూర్తిగా దగ్ధం...

బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని నిజాంపేట్ సర్కిల్ లో అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. సుమారు 6 ఫర్నిచర్ దుకాణాలు అగ్నికి ఆహుతయ్యాయి. షాపుల్లో నిల్వ ఉంచిన ఫర్నిచర్ సామగ్రి పూర్తిగా దగ్ధమై లక్షల రూపాయల నష్టం జరిగింది...సమాచారం అందుకున్న వెంటనే 4 అగ్నిమాపక యంత్రాలు సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చాయి. అగ్నిమాపక సిబ్బంది, స్థానిక పోలీసులు కలిసి సహాయక చర్యలు చేపట్టారు. అగ్నిప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఇటీవలే ఇదే ప్రాంతంలో అగ్నిప్రమాదం చోటుచేసుకున్న నేపథ్యంలో మళ్లీ ఇలాంటి ఘటన జరగడం స్థానికుల్లో ఆందోళన కలిగిస్తోంది. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడం ఉపశమనంగా మారింది. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## క్లారిటీతో కవిత... మిస్సైన షర్మిళ

తెలంగాణాలో వైఎస్సార్ టీపీని స్టార్ట్ చేసి మూడేళ్ళు నడిపి కాంగ్రెస్ లో విలీనం చేసి ఏపీకి వచ్చి పీసీసీ చీఫ్ గా అయిన షర్మిల తన రాజకీయ పోరాటం వైసీపీ మీదనే అని గట్టిగా చెప్పలేకపోయారు అని గుర్తు చేస్తున్నారు. ఆమె వైసీపీ అధినేత జగన్ ని నేరుగా టార్గెట్ చేయడంతో పాటు వ్యక్తిగత అంశాలు కూడా తెర మీదకు రావడంతో షర్మిల ఇంటి పోరునే రాజకీయ పోరాటంగా మార్చుకున్నారు అన్న భావన అయితే జనంలోకి వెళ్ళింది అని ప్రచారంలో ఉన్న మాట. కట్ చేస్తే తెలంగాణాలో మరో చెల్లెలు కవిత పార్టీ పెట్టారు. ఆ పార్టీ కూడా గులాబీ పార్టీని పోలిన పేరుతోనే టీఆర్ఎస్ గా నామకరణం చేశారు. మరి కవిత రాజకీయ పంథా ఎలా ఉంటుంది అన్నది పెద్ద చర్చగా ఉంది. కవిత ఈ మధ్య కేసీఆర్ మీద విమర్శలు చేశారు. దాని మీద చాలా మంది ప్రతి విమర్శలు కూడా ఆమె మీద చేశారు. తండ్రిని పట్టుకుని కవిత ఇంతింత విమర్శలు చేస్తారా అని కూడా నిలదీశారు. అయితే దానికి కవిత మీట్ ది ప్రెస్ లో క్లారిటీ ఇచ్చారు. తాను విమర్శిస్తున్నది బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ని కానీ తన తండ్రి కేసీఆర్ ని కాదని ఆమె స్పష్టం చేశారు. తనకు తల్లిదండ్రులు ఎంతో చేశారని వారి వల్ల ఏ ఇబ్బంది రాలేదని ఆమె అన్నారు. అయితే రాజకీయ సిద్ధాంత పరంగానే తాను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ని విమర్శిస్తున్నాను అని ఆమె చెప్పుకొచ్చారు కేసీఆర్ లేకపోతే తన జీవితం జన్మ లేవని కూడా ఎమోషనల్ గా కామెంట్స్ చేశారు. తనది సిద్ధాంత బద్ధమైన పోరాటమే తప్ప ఇంటి పోరు కాదని పక్కా క్లారిటీతో కవిత చెప్పిన జవాబు తెలంగాణా సమాజానికి వివరణగానే అనుకోవాల్సి ఉంది. ఈ విధంగా ఆదిలోనే కవిత తన మీద వస్తున్న విమర్శలకు చెక్ పెట్టేశారు. కేసీఆర్ తండ్రి అని ఆయనను ఆయన మీద విమర్శలు ఏంటి అని సామాన్య జనంలో కూడా ఉండే అభిప్రాయాలకు సందేహాలకు ఆమె తెర దించారని అనుకోవాల్సి ఉంది. రక్త సంబంధం ఒక ప్రధాన సెంటిమెంట్. రాజకీయాల్లో చూస్తే అది ఎంతో ప్రభావం చూపిస్తుంది. అందుకే రాజకీయంగానే కాదు అన్ని విధాలుగా పెద్ద అయిన కేసీఆర్ విషయంలో కవిత వ్యూహాత్మకంగానే నమస్కార బాణం వేసారు అని భావించాలి. తాను తండ్రి మీద పోరాడడం లేదని రాజకీయంగానే తన సమరం అని ఆమె చెప్పేశారు. అంటే రామాంజనేయ యుద్ధం లాంటిది అన్న మాట. భక్తి ఉన్నా రాముడి మీద ఆంజనేయుడు యుద్ధం చేసింది సిద్ధాంతపరంగా అని అంటారు. కుటుంబ సభ్యులు రాజకీయాల్లో ఉన్నపుడు ఎక్కువగా వారి మధ్య రక్త బంధాలనే అంతా చర్చిస్తారు. దాని వల్ల కొత్తగా పార్టీ పెట్టిన వారికి కానీ అలాగే రాజకీయంగా స్థిరపడాలని చూసిన వారికి కానీ సమస్యలు వస్తాయి. ప్రజా సమస్యల విషయంలో వారు ఎంతగా పోరాడుతున్నా సరైన వివరణ ఇచ్చే ప్రయత్నం చేయకపోతే బూమరాంగ్ అవుతుంది. ఏపీలో షర్మిల ఇష్యూ అలాగే ఉందని అంటున్నారు. అందుకే కవిత అలెర్ట్ అయి ఈ విధంగా ప్రకటించారా అన్న చర్చ సాగుతోంది. తనకు కుటుంబ సభ్యులతో ఏర్పడిన వివాదాల వల్లనే పార్టీని పెట్టాను అన్న విమర్శలు జనంలోకి బలంగా వెళ్తే అది పార్టీ ఎదుగుదలకు తీరని అవరోధంగా మారుతుందని కూడా భావించే కవిత ఈ రకమైన క్లారిటీతో ఉన్నారు అని అంటున్నారు.

## ఆ నలుగురు ఎమ్మెల్యేలకు క్లాస్

తెలంగాణలో ప్రతిపక్షం వాయిస్ పెరుగుతోంది. మెల్లిగా యాక్టివిటీ ఎక్కువ అవుతోంది. రోజుకో అంశాన్ని ఎత్తుకుని అధికార పక్షానికి సవాల్ విసురుతోంది. కానీ... అట్నుంచి మాత్రం దీటైన రియాక్షన్ రానవడం లేదన్న అభిప్రాయం బలంగా ఉంది రాజకీయవర్గాల్లో. విపక్షం ప్రభుత్వం మీద ఎంతలా మాటల దాడి చేస్తున్నా... కాంగ్రెస్ వైపు నుంచి సరైన స్పందన ఉండటం లేదని మాట్లాడుకుంటున్నారు. రాష్ట్ర మంత్రుల నుండి మొదలుకుని...ఎమ్మెల్యేల వరకు ఎవరికి వారే మాకెందుకులే అన్నట్టు ప్రతి అంశాన్ని వదిలేస్తున్నారట. ఇదే ఇప్పుడు పెద్ద మైనస్ అవుతోందన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది.మంత్రులు గతంలో గాంధీభవన్‌కు వెళ్లి ఆ రోజుకి ప్రాధాన్యత కలిగిన అంశం మీదనో.. ప్రతిపక్షం నుండి వచ్చే ఆరోపణల మీదనో స్పందించేవారు. ప్రతిపక్షం కూడా అందుకు తగ్గట్టే ఆచితూచి వ్యవహరించేది. కానీ... ఇప్పుడు ఒకరిద్దరు తప్ప మినిస్టర్స్ వైపు నుంచి పెద్దగా రియాక్షన్ ఉండటం లేదన్నది బహిరంగంగానే మాట్లాడుకుంటున్న మాట. ఏ సమస్య వచ్చినా ఎలాంటి విషయమైనా

ఎంతసేపూ...ప్రతిదానికి సీఎం రేవంత్ రెడ్డే సమాధానం చెప్పుకోవాల్సి వస్తోంది. ఇదే ఇప్పుడు చిరాగ్గా మారుతోందట. పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్, ఎంపీ చామల, ప్రభుత్వ విప్‌లు వెంకట్, వేముల వీరేశం, ఆది

శ్రీనివాస్ లాంటి వాళ్ళు తప్ప బయటకు వచ్చి మాట్లాడేందుకు మిగతా ఎవరికీ మనసు ఒప్పడం లేదా? లేక భయపడుతున్నారా అన్న చర్చలు నడుస్తున్నాయి కాంగ్రెస్ వర్గాల్లో.ప్రభుత్వం ఇటీవలే

విప్‌లను నియమించడంతో... వేముల వీరేశం వారంలో రెండు రోజులు మీడియా సమావేశాలు పెడుతూ ప్రభుత్వంపై వచ్చే విమర్శలకు కౌంటర్ ఇస్తున్నారు. ఒకరిద్దరు నాయకులైతే... పార్టీ ఆఫీస్‌కు

రావడం మానేసి నేరుగా మొబైల్‌లో వీడియోలు తీసి పంపడానికి అలవాటుపడ్డారు. ఇలాంటి వ్యవహారాలన్నిటి మీద సీఎం రేవంత్ రెడ్డి చాలా రోజులుగా నజర్ పెట్టినట్టు తెలిసింది. ఎవరేం చేస్తున్నారు? ఎవరి పని తీరు ఎలా ఉందన్న సంగతిని నిశితంగా పరిశీలిస్తున్నారట. ఈ క్రమంలో ఇటీవల అసెంబ్లీకి సీఎం వచ్చినప్పుడు... ఓ నలుగురు ఎమ్మెల్యేలు ఆయనకు ఎదురుపడ్డారు. వాళ్ళ మీద ఆయన ఒకింత అసహనం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఏం చేస్తున్నారు మీరంతా.. మాకెందుకులే అనుకుంటున్నారా..? అంటూ గట్టిగానే అర్సుకున్నట్టు తెలిసింది.ప్రతిపక్షం నుంచి వచ్చే విమర్శలకే కాదు... కనీసం మనం చేసిన పనుల గురించి అయినా మీడియా సమావేశాలు పెట్టడానికి వచ్చిన ఇబ్బంది ఏంటి..? ప్రెస్‌మీట్స్ ఎలా పెట్టాలో కూడా తెలియదా..? ఏదైనా సరే... చెబితేగానీ మాట్లాడరా..? నలుగురైదుగురు మీూా లు మాట్లాడితే పోయేదేముంది అంటూ గట్టిగానే క్లాస్ ఇచ్చారట. మీూాల పనితీరు పై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటున్న సీఎం రేవంత్... ఇక పూర్తిస్థాయిలో ఫోకస్ పెట్టే పనిలో పడ్డట్టు తెలుస్తోంది. మరి ఆ యాక్షన్‌కు ఎమ్మెల్యేల రియాక్షన్ ఎలా ఉంటుంది? వాళ్ళు మారతారా...? లేక ఆ నలుగురైదుగురే మాట్లాడుకుంటారులే అని ఎప్పట్లాగే ఎవరికి వారు కామ్ అయిపోతారా అన్నది చూడాలి.

# వరి ధాన్యం సేకరణపై తెలంగాణ ప్రభుత్వం కీలక ఆదేశాలు

తెలంగాణలోని పలు జిల్లాల్లో కురుస్తున్న అకాల వర్షాలు మరియు భారీ వేసవి జల్లుల నేపథ్యంలో, రైతులు నష్టపో కుండా ఉండేందుకు రాష్ట్ర నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను అప్రమత్తం చేశారు. అత్యవసర సమీక్షా సమావేశంలో, ధాన్యం సేకరణ ప్రక్రియను వెంటనే వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఒకవైపు ధాన్యం రాక పెరగడం, మరోవైపు ఈ వారం అంతా వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం హై అలర్ట్‌లో ఉంది.ప్రస్తుత రబీ మార్కెటింగ్ సీజన్‌లో ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 14.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. రాష్ట్రంలోని మొత్తం 8,575 కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని, ఇప్పటివరకు 1.84 లక్షల మంది రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి తెలిపారు. రైతులకు చెల్లింపుల విషయంలో కూడా ప్రభుత్వం వేగంగా వ్యవహరిస్తోంది, ఇప్పటికే రూ. 2,001.96 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది.గత రాత్రి కురిసిన భారీ వర్షాలకు నల్గొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం వంటి జిల్లాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. ముఖ్యంగా నల్గొండలో సుమారు 300 మెట్రిక్ టన్నుల ధాన్యం నీటిపాలైంది. ఈ నష్టాన్ని నివారించేందుకు ప్రభుత్వం కొన్ని కీలక వ్యూహాలను అమలు చేస్తోంది. తడిసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన పారాబాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించాలని, వాతావరణ హెచ్చరికల ప్రకారం ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద తగినన్ని తార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. అదనంగా, జిల్లాల్లో 16 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉంచేలా బఫర్ స్టోరేజ్ సామర్థ్యాన్ని కూడా సిద్ధం చేశారు.ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, ధాన్యం సేకరణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రులు తమకు కేటాయించిన జిల్లాల్లో స్వయంగా కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షించాలని కోరారు. రవాణాలో ఇబ్బందులు లేకుండా 18.5 కోట్ల గన్నీ బ్యాగులను అందుబాటులో ఉంచామని, అకాల వర్షాల నుండి రైతుల కష్టాన్ని కాపాడటమే తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యతని ఆయన పునరుద్ఘాటించారు.

# నల్లాల దగ్గర అర్ధరాత్రి నిరీక్షణలు

భానుడి భగభగలకు నగరం విలవిలలాడుతోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు తోడు తాగునీటి కొరత తోడవడంతో సామాన్యుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. నగరానికి నీటిని అందించే ప్రధాన జలాశయాల్లో నిల్వలు వేగంగా పడిపోతుండటమే ఈ దుస్థితికి ప్రధాన కారణం.నగర దాహార్తిని తీర్చే నాగార్జునసాగర్, ఎల్లంపల్లి వంటి జలాశయాల్లో నీటి నిల్వలు ఆందోళనకర స్థాయికి చేరుకున్నాయి.నాగార్జునసాగర్‌లో పూర్తి స్థాయి సామర్థ్యం 312 టీఎంసీలు కాగా, ప్రస్తుతం కేవలం 160 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఎల్లంపల్లిలో ఇక్కడ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. 20 టీఎంసీల సామర్థ్యానికి గాను నిల్వలు 9 టీఎంసీలకు పడిపోయాయి. మే నెలలో ఈ మట్టాలు మరిన్ని కనిష్ఠ స్థాయికి పడిపోయే ప్రమాదం ఉండటంతో జలమండలి అత్యవసర పంపింగ్ చర్యలకు సిద్ధమవుతోంది.సాధారణంగా రోజు విడిచి రోజు రావాల్సిన నీరు, ఇప్పుడు మూడు నాలుగు రోజులకోసారి సరఫరా అవుతోందని పలు ప్రాంతాల ప్రజలు వాపోతున్నారు. సరఫరా అయ్యే కొద్ది సమయం కూడానీటి ఒత్తిడి (ప్రెషర్) తక్కువగా ఉండటంతో బిందెలు నిండటానికి గంటల కొద్దీ వేచి చూడాల్సి వస్తోంది. సీతాఫల్‌మండి, డీబీఆర్ లేన్ వంటి ప్రాంతాల్లో ప్రజలు నిద్ర మానుకొని అర్ధరాత్రి వేళ నీటి కోసం వీధుల్లోఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది.ఒకవైపు నీటి కొరత వేధిస్తుంటే, మరోవైపు పాతబస్తీ, ఖైరతాబాద్, అమీర్‌పేట వంటి ప్రాంతాల్లో పైపులైన్ల లీకేజీల కారణంగా మురుగు నీరు కలిసి వస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నల్లా వదిలిన మొదటి 15-20 నిమిషాల పాటు కలుషిత నీరు వస్తుండటంతో, వాటిని వదిలేయడం వల్ల భారీగా నీరు వృథా అవుతోంది.నల్లా నీరు సక్రమంగా అందకపోవడంతో ప్రజలు ప్రైవేటు ట్యాంకర్లపై ఆధారపడుతున్నారు. దీనివల్ల ఖర్చులు పెరగడమే కాకుండా, ట్యాంకర్ల కోసం కూడా రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. నగరవ్యాప్తంగా సుమారు 14.43 లక్షల కనెక్షన్ల ద్వారా ప్రతిరోజూ 2,647 మిలియన్ లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం జనం దాహార్తి తీరడం లేదు.ఖైరతాబాద్, బేగంపేట, ముషీరాబాద్, చందానగర్, కూకట్‌పల్లి సహా దాదాపు అన్ని ప్రధాన ప్రాంతాల్లో నీటి కష్టాలు తీవ్ర రూపం దాల్చాయి. అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని నగరవాసులు కోరుతున్నారు.

# జూన్ 2 లోపు కేబినెట్ విస్తరణ



తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరి రెండున్నరేళ్లు పూర్తవుతున్న తరుణంలో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. పరిపాలనలో వేగం పెంచడం, రాబోయే సవాళ్లను ఎదుర్కోవడం లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన మంత్రివర్గాన్ని పునర్వ్యవస్థీకరించేందుకు సిద్ధమవుతున్నారు. విశ్వసనీయవర్గాల సమాచారం ప్రకారం జూన్ 2 రాష్ట్ర అవతరణ దినోత్సవం నాటికి కొత్త మంత్రులు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం కనిపిస్తోంది.అందుతున్న సమాచారం ప్రకారం మంత్రివర్గంలో ముగ్గురు కొత్త వాళ్లకు చోటు దక్కే అవకాశం కనిపిస్తోంది. ఇందులో ఖాళీగా ఉన్న ఒక స్థానంతో పాటు, పనితీరు సరిగా లేని ఇద్దరు మంత్రులను తప్పించి వారి స్థానాలను భర్తీ చేయాలని అధిష్ఠానం భావిస్తోంది. ముఖ్యంగా ప్రజలతో నేరుగా సంబంధం ఉండే కీలక శాఖల మంత్రుల పనితీరుపై ఇప్పటికే హైకమాండ్ నివేదికలు

తెప్పించుకుంది. కొన్ని ప్రతిష్ఠాత్మక హామీల అమలులో వెనుకబడిన శాఖల బాధ్యతలను సమర్థులకు అప్పగించేలా భారీ మార్పులు జరగనున్నాయి.కేబినెట్ పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అంశం మరోసారి చర్చకు వచ్చింది. తనకు మంత్రి పదవి ఇస్తామని గతంలో హైకమాండ్ హామీ ఇచ్చిందని ఆయన పదేపదే చెప్తున్నారు. అయితే, ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి

ఇప్పటికే తన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రులుగా ఉన్నారు. దీంతో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఈసారి కేబినెట్ లో చోటు దక్కుతుందా లేదా అనేది ఆసక్తి రేపుతోంది. అయితే కోమటిరెడ్డి సోదరుల్లో ఒకరికే అవకాశం అనే నిబంధనను అధిష్ఠానం తెరపైకి తెచ్చినట్లు సమాచారం. ఒకవేళ రాజగోపాల్‌రెడ్డికి చోటు కల్పించాల్సి వస్తే, వెంకట్‌రెడ్డిని కేబినెట్ నుంచి తప్పించే అవకాశం ఉంది. పైగా సీఎం రేవంత్ రెడ్డితో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి గ్యాప్ వచ్చినట్లు సమాచారం.మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు ఉండబోతున్నాయని తెలియగానే పలువురు సీనియర్లు గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. ఎస్టీ కోటాలో మహబూబాబాద్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్, బాలూ నాయక్ మధ్య పోటీ నెలకొంది. బీసీ కోటాలో మున్నూరు కాపు వర్గం నుండి ఆది శ్రీనివాస్ పేరు వినిపిస్తోంది. ఇక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ కూడా మంత్రివర్గంలో చోటుకోసం ప్రయత్నిస్తున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సైతం కేబినెట్ లోకి వెళ్లాలని ఆశిస్తున్నట్టు సమాచారం.కేవలం కేబినెట్ మాత్రమే కాకుండా, టీపీసీసీలో ఖాళీగా ఉన్న కార్యనిర్వాహక అధ్యక్షుల నియామకంపై కూడా కసరత్తు జరుగుతోంది. ఎస్సీ మాదిగ వర్గం నుంచి సంపత్ కుమార్, ఎస్టీ లంబాడ వర్గం నుంచి బలరాం నాయక్ లేదా బెల్లయ్య నాయక్ ను కార్యవర్గంలోకి తీసుకునే అవకాశం ఉంది. రెడ్డి సామాజిక వర్గం నుంచి నాయిని రాజేందర్ రెడ్డి లేదా చామల కిరణ్ కుమార్ రెడ్డికి చోటు దక్కవచ్చు.మైనార్టీల నుంచి అజ్మతుల్లా, ఫహీమ్ ఖురేషీ స్థానం ఆశిస్తున్నారు. వీళ్లతో పాటు ప్రచార కమిటీ ఛైర్మన్‌గా మధుయాష్కీని కొనసాగించాలా లేదా అన్నది, కోశాధికారిగా రోహిన్ రెడ్డి నియామకం వంటిఅంశాలపై త్వరలోనే స్పష్టత రానుంది.మొత్తానికి జూన్ 2 లోపు జరగబోయే ఈ మార్పులు అటు ప్రభుత్వంలోనూ, ఇటు పార్టీలోనూ కొత్త జోష్ నింపుతాయా లేక అసంతృప్తులకు దారితీస్తాయా అన్నది వేచి చూడాలి.

# మోడీ సభ నుంచి ఆపరేషన్ తెలంగాణ



తెలంగాణ రాజకీయాల్లో మరోసారి వేడి రాజుకుంది. ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన ఖరారు కావడంతో రాష్ట్ర బీజేపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మూడోసారి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారి తెలంగాణ గడ్డపై అడుగుపెడుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. మే 10న హైదరాబాద్ వేదికగా జరగనున్న ఈ పర్యటన కేవలం ప్రభుత్వ కార్యక్రమాలకే పరిమితం కాకుండా, రాబోయే ఎన్నికలకు శంఖారావంగా మారుతుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.మే 10న హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించేందుకు బీజేపీ సర్వసన్నద్ధమవుతోంది. ఈసభకు 'జానగ్రహ సభ' అని పేరు పెట్టింది. గత ఎన్నికల్లో సాధించిన విజయాలు, ప్రభుత్వ వ్యతిరేకతను తమకు అనుకూలంగా మార్చుకోవాలనే లక్ష్యంతో ఈ పేరును ఖరారు చేసినట్లు తెలుస్తోంది. ఈ సభ ద్వారా రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్ పార్టీలపై నేరుగా విమర్శనాస్త్రాలు సంధించే అవకాశం ఉంది. రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున జన సమీకరణ చేసి, కేడర్‌లో నూతన ఉత్తేజాన్ని నింపాలని హైకమాండ్ భావిస్తోంది.రాజకీయ సభతో పాటు, హైదరాబాద్ పరిధిలో దాదాపు రూ.7,700 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. మౌలిక సదుపాయాలు, రవాణా, ఇతర ప్రజాహిత కార్యక్రమాలకు సంబంధించిన ఈ భారీ కేటాయింపుల ద్వారా తెలంగాణ అభివృద్ధిపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించిందనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని

బీజేపీ భావిస్తోంది.ఈ ఏడాది జరగనున్న జీహెచ్‌ఎంసీ మేయర్ ఎన్నికలే లక్ష్యంగా బీజేపీ తన అడుగులు వేస్తోంది. గత ఎన్నికల్లో అనూహ్య రీతిలో పుంజుకున్న బీజేపీ, కాంగ్రెస్‌ను మూడో స్థానానికిపరిమితం చేసి ప్రధాన ప్రతిపక్షంగా నిలిచింది. ఈసారి ఎలాగైనా మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోవాలనే పట్టుదలతో ఉంది. మే 4న విడుదలయ్యే ఐదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల్లో బీజేపీ ఘనవిజయం సాధిస్తుందని ఆ పార్టీ నమ్మకంగా ఉంది. ఆ గెలుపు ఉత్సాహంతో తెలంగా ణలో 'ఆపరేషన్ తెలంగాణ'ను ప్రారంభించి, దక్షిణాదిలో తన పట్టును మరింత బిగించాలని చూస్తోంది.కర్ణాటక తర్వాత దక్షిణాదిలో తెలంగాణనే తమకు అనుకూలమైన రాష్ట్రమని బీజేపీ మొదటి నుంచీ చెబుతోంది. అయితే, రాష్ట్ర పార్టీలో ఉన్న అంతర్గత విభేదాలు కొంతకాలంగా ఇబ్బందికరంగా మారాయి. ఈ నేపథ్యంలోనే కేంద్ర నాయకత్వం నేరుగా రంగంలోకి దిగింది. వర్గపోరుకు చెక్ పెట్టి, పార్టీని బలోపేతం చేసేందుకు హైకమాండ్ ప్రత్యేక కార్యాచరణను రూపొందించింది. ప్రధాని మోదీ పర్యటన ద్వారా పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసి, కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల వైఫల్యాలను ఎండగట్టాలని పిలుపునివ్వనున్నారు.మొత్తానికి మే 10న జరిగే ప్రధాని మోదీ పర్యటన తెలంగాణ రాజకీయాల్లో పెను మార్పులకు నాంది పలుకుతుందా? 'జానగ్రహ సభ' ద్వారా బీజేపీ తన సత్తా చాటుతుందా? అనేది ఇప్పుడు అత్యంత ఆసక్తికరంగా మారింది. ఒకవైపు అభివృద్ధి పనులు, మరోవైపు రాజకీయ ఎత్తుగడలతో తెలంగాణను కైవసం చేసుకునేందుకు

కమలనాథులు వేస్తున్న స్కెచ్ ఏ మేరకు పారుతుందో వేచి చూడాలి.

## అంబేద్కర్ విగ్రహం ధ్వంసం.... వెంటనే పునఃప్రతిష్టాపన

* సింగారంలో అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరించిన డిఎస్పి.



**న్యూస్ ఇండియా తెలుగు మే 5. మహబూబాబాద్ జిల్లా బయ్యారం:**....మండలంలోని సింగారం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడంతో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అంబేద్కర్ విగ్రహానికి జరిగిన నష్టాన్ని గ్రహించిన గార్ల బయ్యారం సీఐ రవీందర్,ఎస్సై ప్రశాంత్ బాబు ఆధ్వర్యంలో గ్రామస్తులతో మాట్లాడి ధ్వంసమైన విగ్రహ స్థానంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నూతన విగ్రహాన్ని మహబూబాబాద్ డిఎస్పి తిరుపతి రావు చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా ఎస్పీ శబరీష ఆదేశానుసారం నూతన విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించినట్లు తెలిపారు. ప్రశాంతంగా ఉన్న గ్రామంలో అలజడి సృష్టించడానికి ఎవరో కావాలని అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేశారని, వారు ఎంతటి వారైనా వదిలే ప్రసక్తి లేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగించి అంబేద్కర్ కు జరిగిన అవమానానికి తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు,పోలీస్ సిబ్బంది మోహన్,సుబ్రహ్మణ్యం,కోటేష్,సతీష్, విజయ్,మహేందర్ రెడ్డి,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# చెరువులో పడి వ్యక్తి మృతి



**సుజాతనగర్ (న్యూస్ ఇండియా)మే 5** :కోమటిపల్లి గ్రామానికి చెందిన బాదావత్ శ్రీను (45) , అను వ్యక్తి సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు తన ఇంటి నుంచి బయలుదేరి ఊరి వెనక ఉన్న నిమ్మలకుంట చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో చెరువు కట్టమీద అతని బట్టలు మరియు చెప్పులను అతని కుటుంబ సభ్యులు గమనించి పోలీసువారికి తెలియపరచగా నిన్న రాత్రి సుజాతనగర్ ఎస్ఐ రమాదేవి మరియు చుంచుపల్లి సీఐ వెంకటేశ్వర్లు చెరువులో గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం ఉదయం తెల్లవారుజామున 6 గంటలకు శ్రీను చనిపోయి చెరువుపై తేలాడు. బాదావత్ శ్రీను నిమ్మలకుంట చెరువులోకి చేపలు పట్టడానికి వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయి చనిపోయినాడు అని,అతని భార్య బాదావత్ శారద ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## బోడ్మాట్ పల్లి లో కన్నుల పండుగగా జాతర బండ్ల ఊరేగింపు



**న్యూస్ ఇండియా (టేక్మాల్ ప్రతినిధి జైపాల్ మే05)**: మెదక్ జిల్లా ఆందోల్ నియోజకవర్గం లోని టేక్మాల్ మండలం లో భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఉత్సవాలు మూడు రోజులుగా అంగరంగ వైభవంగా ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పు బస్వరాజ్, వైస్ చైర్మన్ ఘటంగారి ఈశ్వరప్ప ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్నాయి. ఇందులో భాగంగా మంగళవారం రోజున జాతర బండ్లు ఊరేగింపు అత్యంత ప్రధానమైన భక్తి భరితమైన ఘట్టం, బండ్ల ఊరేగింపు కార్యక్రమాన్ని చూడటానికి పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సన్నాయి డప్పులు, బ్యాండ్ మేళాలకు యువకులు, నృత్యం చేశారు. చూపరులకు కనులవిందుగా ఆనందాన్ని కలిగించాయి. భద్ర కాలి సమేత వీరభద్ర స్వామి వారి జాతర లో భాగంగా నేడు బండ్ల ఊరేగింపు కార్యక్రమం లో పాల్గొన్న టేక్మాల్ మండల ఎమ్మార్వో తులసిరామ్ గ్రామ సర్పంచ్ తలారి అవినాష్ కుమార్ ఆలయ కమిటీ చైర్మన్ ఉప్పు బసవరాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు శంకర్ మరియు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

# తొర్రూర్ డివిజన్‌లో ఘనంగా విద్యుత్ భద్రతా వారోత్సవాలు

జీరో యాక్సిడెంట్' లక్ష్యంగా పనిచేయాలి

**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 05 (మహబూబాబాద్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్)**తెలంగాణ ఉత్తర మండలం విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీ ఎన్పీడీసీఎల్) మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ డివిజన్ పరిధిలో విద్యుత్ భద్రతా వారోత్సవాలు మంగళవారం ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా తొర్రూర్, నెల్లికుదురు మరియు మరిపెడ సబ్‌డివిజన్‌ల పరిధిలోని కార్మికుల కోసం తొర్రూర్ పట్టణంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఫంక్షన్ హాల్‌లో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

ప్రమాద రహిత సేవలే లక్ష్యం

టెక్నికల్ డీఈ (సేఫ్టీ ఆఫీసర్) శ్రీ హీరాలాల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డివిజనల్ ఇంజనీర్ (డి ఈ) శ్రీ బి. రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆఉ మాట్లాడుతూ, గౌరవ సిఎండి గారి పిలుపు మేరకు "జీరో యాక్సిడెంట్ మిషన్" (జీరో యాక్సిడెంట్ మిషన్) విజయవంతం చేయడానికి ప్రతి ఉద్యోగి కట్టుబడి ఉండాలని సూచించారు.

అధికారులు వెల్లడించిన కీలక

ఫీల్డ్‌లో పనిచేసే సిబ్బంది అత్యంత అప్రమత్తంగా ఉండాలి. విద్యుత్ లైన్లపై పని చేసేటప్పుడు ఎర్త్ రాడ్లు, గ్లౌజులు, హెల్మెట్ వంటి భద్రతా పరికరాలను తప్పనిసరిగా ధరించాలి.

సమావేశంలో పాల్గొన్న సీనియర్ కార్మికులు క్షేత్రస్థాయిలో తమకు ఎదురైన భద్రతా పరమైన సవాళ్లను, అనుభవాలను ఇతర సిబ్బందితో పంచుకున్నారు.

ప్రతిజ్ఞ: కార్యక్రమంలో పాల్గొన్న అధికారులందరూ సిబ్బందితో విద్యుత్ భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. ప్రాణాల కంటే ఏదీ ముఖ్యం కాదని, ఒత్తిడిలో కూడా నిబంధనలు విస్మరించకూడదని పిలుపునిచ్చారు.




ప్రజలకు విజ్ఞప్తి

విద్యుత్ ప్రమాదాల నివారణలో ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమని అధికారులు పేర్కొంటూ పలు సూచనలు చేశారు:

తెగిపడిన విద్యుత్ వైర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ ముట్టుకోకూడదు.

ఇళ్లపై నుండి లేదా కాంపౌండ్‌లలో వెళ్లే విద్యుత్ తీగలకు దగ్గరగా బట్టలు ఆరేయడం, వస్తువులు ఉంచడం చేయరాదు.

అనధికారిక వ్యక్తులతో లైన్లకు లేదా ట్రాన్స్‌ఫార్మర్‌లకు ఫ్యూజ్‌లు వేయించకూడదు.

ఏవైనా సాంకేతిక లోపాలు లేదా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే 1912 కాల్ సెంటర్‌కు సమాచారం అందించాలి.

పాల్గొన్న అధికారులు:

ఈ కార్యక్రమంలో తొర్రూర్ ఙ నెల్లికుదురు ఏ డి ఈ చలపతి రావు, మరిపెడ ఏ డి ఈ శ్రీ ఎం. శ్రీనివాస్, డివిజన్ పరిధిలోని అన్ని సెక్షన్ల ఏ ఈలు, సబ్ ఇంజనీర్లు మరియు ఓడయం సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రైస్ మిల్లును పరిశీలించిన అదనపు కలెక్టర్ అనిల్ కుమార్

మడిపల్లి రోడ్డులోని శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్లులో తనిఖీలు

**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 05 (మహబూబాబాద్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఙమండలం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) అనిల్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మండల పరిధిలోని మడిపల్లి రోడ్డులో ఉన్న శ్రీ వెంకటేశ్వర రైస్ మిల్లును సివిల్ సప్లై డీఎస్ఓ (ఞూూ) తో కలిసి ఆయన సందర్శించారు.


ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని మిల్లుల్లో నిల్వ చేసేటప్పుడు ఎటువంటి జాప్యం జరగకూడదని పేర్కొన్నారు. మిల్లులోని నిల్వ సామర్థ్యం, ధాన్యం దిగుమతి అవుతున్న తీరును ఆయన స్వయంగా పరిశీలించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో



ఇంచార్జి తహశీల్దార్ ఉప్పల నరసయ్య, మండల గిర్దావర్ (=×) నజీముద్దీన్, టౌన్ జీపీఓ (ఠూూ) మరియు ఇతర రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం సేకరణ మరియు మిల్లింగ్ ప్రక్రియలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా అధికారులు హెచ్చరించారు.

## సమాచారం ఆలస్యంతో రాష్ట్ర సమాచార కమిషన్ ను రూ.6.5 లక్షల నష్ట -- పరిహారం కోరిన ఆర్టీఐ కార్యకర్త



TELANGANA INFORMATION COMMISSION
(Under Right to Information Act, 2005)
D.No.5-4-399, Samachara Hakku Bhavan (Old ACB Building), Mojam-Jahi-Market, Hyderabad – 500 001 - Phone: 040-24740667 (Off)

NOTICE

Case No.11731/SIC-PVSR/2025 Date:20-04-2026

Ref:- 1. 6(1) Application dated 20-05-2025 filed before the PIO.
2. 19(1) 1st Appeal dated 14-06-2025 filed before the 1st Appellate Authority.
&&&

Whereas Sri G. Ganesh has filed an appeal U/s 19(3) of the RTI Act, 2005 before this Commission against the Public Authority; and whereas the said appeal is posted for hearing on the 06th day of May, 2026 at 10.00 a.m.

A. The Respondents are hereby directed to appear in person before the Commission in Court Hall No.1, Room No. GF-2 at ground floor at 10.00 a.m. on the 06th day of May , 2026 along with written affidavits containing:
(i) the action taken (point wise)on 6(1) application / 19(1) appeal.
(ii) copies of information furnished to the appellant and proof of dispatch / receipt / acknowledgement by the appellant.
(iii) point wise counter on the 2nd appeal along with enclosed affidavit duly filled in all respects; and
(iv) the Respondent shall produce a copy of the 4(1) (b) data for the perusal of State Information Commission.

B. The Appellant to attend the hearing on the said date and time along with affidavits containing the:
(i) points for which information is not furnished; and
(ii). Points for which information furnished is unsatisfactory / incorrect / false giving complete justification in support of his claim.
(iii). The Appellant should bring with him all the connected records, such as, 6(1) application, 19(1) application, copy of the information furnished by the PIO, if any, etc.

All Appeals will be decided on the basis of material placed before the Commission and as per the merits of the case.
Given under the seal of the Telangana Information Commission on this, the 20th day of April, 2026.


Encl:- (i). 6(1) application; (ii). Blank Affidavit form.

// BY ORDER //
PS to SIC-PVSR

To
Appellant: Sri G. Ganesh, S/o. Ravi, H No. 4-76/1, Narsimhulapet Vill & Mandal, Mahabubabad District-506324.

Respondent: 1) The Public Information Officer (U/RTI Act,2005) The Gram Panchayat Secretary, Narsimhulapet Vill & Mandal, Mahabubabad District-506324.
2) The First Appellate Authority (U/RTI Act, 2005) O/o. the Mandal Parishad Development Officer, MPP, Narsimhulapet Mandal, Mahabubabad District-506324.

Note: In case the 6(1) application was transferred to some other PIO U/s. 6(3) of RTI Act, a copy of this notice should be transmitted by the PIO mentioned above, to the deemed PIO to also attend the hearing in the Commission on the said date and time.



* బీపీఎల్ అభ్యర్థిగా సమాచారం నిరాకరణపై రాష్ట్ర సమాచార కమిషన్ కు పిర్యాదు
* పి.ఐ.ఓ ఙ ఫస్ట్ అప్పేలేట్ అధికారుల వ్యక్తిగత హాజరుకు కమిషన్ సమన్లు జారీ
* ఆర్టీఐ హక్కుల కోసం యువ న్యాయవాది గాడిపల్లి గణేష్ పోరాటం

**నర్సింహులపేట,న్యూస్ ఇండియా ప్రతినిధి (సాయి)** మహబూబాబాద్ జిల్లా, నర్సింహులపేట గ్రామవాసి గాడిపల్లి గణేష్ బీపీఎల్ కుటుంబానికి చెందిన వ్యక్తిగా సుమారు ఏడాది క్రితం ఇందిరమ్మ ఇండ్లు పథకంలో వారి ఇళ్లు మంజూరును అధికారులు తిరస్కరించిన సందర్భంగా అట్టి పథకానికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని కోరుతూ ఆర్టీఐ దరఖాస్తు సమర్పించగా, సంబంధిత పబ్లిక్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (పీ. ఐ. ఓ) చట్ట విరుద్ధంగా రూ.6,171/- ఫీజు డిమాండ్ చేశారు. ఆర్టీఐ చట్టం సెక్షన్ 7(5) ప్రకారం బీపీఎల్ వర్గాలకు సమాచారం ఉచితంగా ఇవ్వాలి. అయినప్పటికీ ఈ నిబంధనను విస్మరించడం గమనార్హం. తదుపరి తను ఎం.పి.డి.ఓ ముందు దాఖలు చేసిన ఫస్ట్ అప్పీల్‌లో కూడా సరైన న్యాయం జరగకపోవడం విచారకరం. దీంతో గణేష్ తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, గౌరవ న్యాయస్థానం (ఛ్రొ చీశ. 26249/2025) సమాచారం ఉచితంగా అందించాలని ఆదేశించడం ఆయన పోరాటానికి బలాన్నిచ్చింది. అయితే ఈ ఆలస్యం కారణంగా ఆయన కుటుంబం సుమారు రూ.5 లక్షల ఆర్థిక సహాయం పొందే అవకాశాన్ని కోల్పోవడమే కాకుండా సమాచారాన్ని ఇవ్వకుండా తనను మానసికంగా ఇబ్బందికి గురైనందుకు సంబంధిత శాఖ అధికారులు రూ. 6.5 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని కమిషన్ ను పిర్యాదు రూపంలో కోరాడు.

ఈ వ్యవహారంపై గణేష్ రాష్ట్ర సమాచార కమిషన్‌ను ఆశ్రయించగా, కమిషన్ సంబంధిత పి.ఐ.ఓ (పంచాయతీ కార్యదర్శి, నర్సింహులపేట) మరియు ఫస్ట్ అప్పీలెట్ అధికారులను (ఙీఞూ, నర్సింహులపేట) నోటీస్ నం. 11731/ూ×జ-ూఙూ=/2025 ద్వారా రేపు అనగా తేదీ: 06.05.2026న 10:00 గంటలకు కమిషన్ ముందు వ్యక్తిగతంగా హాజరై పూర్తి వివరణ ఇవ్వాలని నోటీసులు జారీ చేయడం రాష్ట్రంలో ఇప్పుడు ఒక ముఖ్యమైన పరిణామంగా నిలిచింది. ఇది ఆర్టీఐ చట్టం అమలు పట్ల బాధ్యతను గుర్తుచేసే చర్యగా భావించవచ్చు.

న్యాయవాదిగా మరియు ఆర్టీఐ కార్యకర్తగా గణేష్ పారదర్శక పాలన కోసం నిరంతరం కృషి చేస్తూ, ప్రజల హక్కుల పరిరక్షణలో ముందుంటున్నారు. సమాచార హక్కు ఒక ప్రాథమిక హక్కు అని, దాన్ని అడ్డుకోవడం ప్రజాస్వామ్యానికి హానికరమని ఆయన స్పష్టం చేశారు.

తెలంగాణ రాష్ట్రంలో సమాచార హక్కు చట్టం (=× ాూష్, 2005) అమలు విషయంలో జరుగుతున్న లోపాలను వెలుగులోకి తీసుకురావడంలో యువ న్యాయవాది మరియు ఆర్టీఐ కార్యకర్త గాడిపల్లి గణేష్ కీలక పాత్ర పోషిస్తున్నారు. ప్రజలకు చట్టబద్ధంగా లభించాల్సిన సమాచారాన్ని అధికారులు నిర్లక్ష్యంగా అడ్డుకోవడం పట్ల ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అయితే ఇప్పుడు ఈ కేసు రాష్ట్రం లో ఒక చర్చనీయాంశంగా మారింది. స. హ చట్టం అమలులో జాప్యం చేస్తున్నా అధికారుల పట్ల రాష్ట్ర సమాచార కమిషన్ నిప్పులు చెరుగుతూ జారీ చేస్తున్న తీర్పుల నేపథ్యంలో, ఈ కేసుపై ఎలాంటి తీర్పు ఇస్తుంది అనేదానిపై రాష్ట్రంలో ఇప్పుడు ప్రాతినిధ్యం ఏర్పడింది అంటూ స.హా చట్టం కార్యకర్తలు మరియు సంఘాలు ఎదురుచూస్తున్నాం అని తెలిపారు.

## తెలంగాణ ఫర్టిలైజర్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా చీదర మహేష్



**న్యూస్ ఇండియా తెలుగు దినపత్రిక మే 05 (మహబూబాబాద్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్)**తెలంగాణ ఫర్టిలైజర్స్ పెస్టిసైడ్స్ సీడ్స్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణానికి చెందిన చీదర మహేష్ నియమితులయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగూర్ల వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో అధికారికంగా వెల్లడించారు.

చీదర మహేష్ గత 28 ఏళ్లుగా ఫర్టిలైజర్ వ్యాపార రంగంలో ఉంటూ, స్థానిక రైతులకు విశేష సేవలు అందిస్తున్నారు.

రైతులకు ఆయన అందిస్తున్న సేవలను మరియు అసోసియేషన్ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు రాష్ట్ర కమిటీ తెలిపింది.

తన నియామకానికి సహకరించిన మహబూబాబాద్ జిల్లా మాజీ అధ్యక్షుడు, రాష్ట్ర సహాయ కార్యదర్శి ప్రతాపని పాండురంగయ్యకు, జిల్లా కమిటీ సభ్యులకు, రాష్ట్ర అధ్యక్షులకు మహేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

"డీలర్ల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి నా వంతు కృషి చేస్తాను. నాపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర, జిల్లా కమిటీలకు ధన్యవాదాలు."

--- చీదర మహేష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు.

ఈ నియామకం పట్ల తొర్రూరు పట్టణంలోని వ్యాపారులు మరియు అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ మహేష్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

# భద్రాచలం నూతన డీఎస్పీ కలిసిన బీజేపీ నాయకులు



**భద్రాద్రి కొత్తగూడెం(న్యూస్ ఇండియా జిల్లా ప్రతినిధి) మే6:**భద్రాచలానికి నూతనంగా నియమితులైన డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్ ను మంగళవారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ )నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి,శుభాకాంక్షలు తెలిపారు.
ప్రాంతంలో చట్టవ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజలకు వేగవంతమైన మరియు పారదర్శకమైన పోలీసింగ్ అందించాలని, సాధారణ ప్రజల సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని నాయకులు కోరారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంజా ధర్మారావు, కుంజా సంతోష్, నిడదవోలు నాగబాబు, ములిశెట్టి రామ్మోహన్ రావు, బోడ సత్యనారాయణ, ముత్యాల చంద్రశేఖర్, ములిశెట్టి నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల శ్రేయస్సు కోసం కృషి చేస్తాం:కొత్వాల

- పాల్వంచ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ గా కొత్వాల పదవి బాధ్యతల స్వీకారం



**భద్రాది కొత్తగూడెం (న్యూస్ ఇండియా ప్రతినిధి)మే5:** రైతుల శ్రేయస్సుకై సొసైటీ పాలకవర్గం కృషి చేస్తుందని పాల్వంచ సొసైటీ అధ్యక్షులు, డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ సహకార సంఘం అధ్యక్షులుగా కొత్వాల తోపాటు పాలకవర్గం సభ్యులు తిరిగి పదవి భాద్యతలు స్వీకరించారు. మంగళవారం సొసైటీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సొసైటీ పర్సన్ ఇంచార్జి జయశ్రీ నుండి కొత్వాలతో పాటు వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, సభ్యులు బుడగం రామ్మోహన్ రావు, కనగాల నారాయణరావు, చౌగాని పాపారావు, జరబన సీతారాంబాబు, సామా జనార్ధనరెడ్డి, భూక్యా కిషన్, యర్రంశెట్టి మధుసూదన్ రావు లు పదవి భాద్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ రైతుల బాగోగుల కోసం తిరిగి పాలకవర్గాలను నియమించిన తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నిత్యం రైతులకు అందుబాటులో వుంటూ, వారి శ్రేయస్సుకై కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం ద్వారా చేపట్టే సంక్షేమ కార్యక్రమాలను రైతులకు అందేలా కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈఓ జి.లక్ష్మీనారాయణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా టాపర్ కావ్యశ్రీ సన్మానించిన ఎస్సై రఘుబాబు గౌడ్

- ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నత బోధనలు
- నేను మల్లంపల్లి హైస్కూల్ లో చదువుకున్న పూర్వ విద్యార్థినే
- నాగార్జున సాగర్ డ్యాం ఎస్సై బూర రఘుబాబు గౌడ్‌లి



**న్యూస్ ఇండియా :దుగ్గొండి:**ఇటీవల వెలువడిన పదవ తరగతి పరీక్షలలో ఉత్తీర్ణత సాధించి వరంగల్ జిల్లా టాపర్ గా నిలిచిన మల్లంపల్లి గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ తడుక కొమురయ్య సువర్ణ మనవరాలు జనగాం కావ్యశ్రీ ఘన సన్మానం జరిగింది. దుగ్గొండి మండలంలోని మల్లంపల్లి హైస్కూల్ విద్యార్థినీ కావ్యశ్రీని అదే గ్రామానికి చెందిన ప్రస్తుతం నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ డ్యాం ఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న బూర రఘుబాబు గౌడ్ మంగళవారం శాలువాతో ఘనంగా సన్మానించారు. ఇదే స్పూర్తితో భవిష్యత్ పట్ల ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాక్షించారు. ఈ సందర్భంగా ఎస్సై బూర రఘుబాబు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత గల ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. తను కూడా ఇదే ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత సాధించి నేడు ఈ స్థాయిలో ఉన్నానని పూర్వ విద్యార్థి జ్ఞాపకాలను గుర్తుకుచేశారు. పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిగమించాలని ఈ సందర్భంగా ఎస్సై రఘుబాబు గౌడ్ జిల్లా టాపర్ జనగాం కావ్యశ్రీకి సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ తాలూకా కొమురయ్య సువర్ణ పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పెద్దమ్మ గుడి నిర్మాణమునకు విరాళామందించిన దాతలు



**న్యూస్ ఇండియా శ్రీరంగాపూర్**
శ్రీరంగాపూర్ మండల్ వెంకటాపూర్ గ్రామంలో మంగళవారం రోజున పెద్దమ్మ గుడి నిర్మాణం కొరకు వెంకటాపూర్ గ్రామ కులస్తులు దైవ భక్తితో విరాళం అందించడం జరిగింది. గ్రామంలో అన్ని కులస్తులు తన వంతు ఆర్థిక సాయం అందించారు . కాబట్టి పెద్దమ్మ గుడి నిర్మాణం కు
1) లిసాకలి ఆర్ వెంకటేష్ సన్నాఫ్ రంగన్న 5000 వేల రూపాయలు
2) కుమ్మరి చిన్న నాగన్న 10000 వేల రూపాయలు
3) పెద్దమ్మ గుడి శిఖరం పైన కలశం సి సంధ్య ఎ/గణేష్ ఆచారి వనపర్తి
గ్రామ పెద్దలకు దేవాలయ మేనేజ్మెంట్ సభ్యులకు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కృష్ణయ్య బుక్క మన్నెమ్మ సాకలి ఎల్లయ్య బుక్క ఆనంద్ కుమ్మరి రాముడు చిన్న నాగన్న హరిజన్ రామస్వామి కుమ్మరి దశరథం కుమ్మరి రాజు మరియు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చిల్లర్గి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నూతన పాలకవర్గం బాధ్యతల స్వీకరణ



**న్యూస్ ఇండియా ప్రతినిధి యాదగిరి కామారెడ్డి** :కామారెడ్డి జిల్లా పిట్లం మండలంలోనీ చిల్లర్గి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో నూతన పాలకవర్గం సభ్యులు ఈరోజు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. సంఘ అధ్యక్షులుగా ఒంటరి శపథం రెడ్డి, ఉపాధ్యక్షులుగా డాకూరి వెంకట్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. అలాగే పాలకవర్గం సభ్యులు కూడా తమ విధులను స్వీకరించారు.
ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పిట్లం గ్రామ సర్పంచ్ కుమ్మరి శేఖర్, రాంరెడ్డి, జొన్న మోహన్ రెడ్డి, బుగుడాల నవీన్, మోహిన్ , కుమ్మరి యాదగిరి, ఇమ్రోస్, శివతో పాటు సంఘ సెక్రటరీ, సిబ్బంది, రాజకీయ నాయకులు, రైతులు పాల్గొన్నారు.
నూతన పాలకవర్గం రైతుల సంక్షేమానికి కృషి చేస్తామని, సహకార సంఘ అభివృద్ధికి నిరంతరం పనిచేస్తామని తెలిపారు.

## పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఒక వరం హోం మంత్రి అనిత





- హోంమంత్రి అనిత చేతుల మీదుగా సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

**నక్కపల్లి,న్యూస్ ఇండియా ప్రతినిధి** :నక్కపల్లి మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద హోం మంత్రి వంగలపూడి అనిత సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన 56 మంది లబ్ధిదారులకు ఈ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి అనిత మాట్లాడుతూ, అనారోగ్యం లేదా అత్యవసర పరిస్థితుల్లో ఉన్న పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగంగా నిలుస్తుందని అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం ఎప్పుడూ ప్రజల సంక్షేమానికి కట్టుబడి ఉందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు,లబ్ధిదారులు పాల్గొన్నారు.



## వీహెచ్ హనుమంత్‌రావుకు బీసీ సలహాదారు పదవి: ఘనంగా సన్మానం



**న్యూస్ ఇండియా ప్రతినిధి యాదగిరి** :కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వీహెచ్ హనుమంత్‌రావుకు ప్రభుత్వ బీసీ సలహాదారు పదవిని కేటాయించిన నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు బీసీ సంఘం నాయకులు, ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు
ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బాశెట్టి అశోక్, మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి వెన్నుముక లాంటి వ్యక్తి వీహెచ్ హనుమంత్‌రావు చేసిన కృషిని గుర్తించి ప్రభుత్వం ఈ పదవిని ఇవ్వడం హర్షణీయమని పేర్కొన్నారు. బీసీ వర్గాలకు ప్రాధాన్యత ఇస్తున్న కాంగ్రెస్ పార్టీ నిర్ణయం అభినందనీయమని తెలిపారు
ఈ సన్మాన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు,బీసీ సంఘం మాజీ ఎమ్మెల్సీ లలిత, ఉమా,భాశెట్టి అశోక్, కుమారస్వామి, రాజు, బాశెట్టి రామస్వామి, రాజు, గంగా భవాని,పెద్ద సంఖ్యలో పాల్గొని వీహెచ్ హనుమంత్‌రావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## ఈఎంఆర్ఎస్ లో 11వ తరగతిలో దరఖాస్తులకు ఆహ్వానం

- ఎస్టీ విద్యార్థిని విద్యార్థులు మాత్రమే అర్హులు




**భద్రాద్రి కొత్తగూడెం(న్యూస్ ఇండియా ప్రతినిధి) మే 5 :** కొత్తగూడెంలోని రామవరంలో గల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఈఎంఆర్ఎస్ నందు , ఈ విద్య సంవత్సరం పదవ తరగతి ఉత్తీర్ణత చెందిన బాల బాలికలు,పదకొండవ తరగతి సీబీఎస్ఈ లో చదువుకొనుటకు, ఆసక్తిగల విద్యార్థిని విద్యార్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తుంది . విద్యార్థులు ఎంచుకోవాల్సిన కోర్సులు, ఎంపీసీ, బైపిసి, సిఇసి ,పలు గ్రూపులలో ఆసక్తి కళా విద్యార్థిని విద్యార్థులు, ఎస్టీ విద్యార్థిని విద్యార్థులు మాత్రమే అర్హులని తెలియజేస్తూ ,ఈనెల 15వ తేదీ లోపు దరఖాస్తులను ఈఎంఆర్ఎస్ రామవరం పంజాబ్ గడ్డ నందు దరఖాస్తు చేసుకోవాలి. ఆసక్తి గల విద్యార్థిని విద్యార్థులు, ఈ.ఎం.ఆర్.ఎస్ రామవరం నందు దరఖాస్తు ఫారం ను పొంది ,పూర్తి చేసిన దరఖాస్తు ఫారం ను ఈనెల 15వ తేదీ లోపు సమర్పించాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు ఈ.ఎం.ఆర్.ఎస్ ప్రిన్సిపల్ (8277020057) ఫోన్ నెంబర్ను సంప్రదించవచ్చు.

## ఎరువులు సరఫరాలో ఏపీఎఐఎంఎస్ యాప్ అత్యంత కీలకం




**ఎలమంచిలి న్యూస్ ఇండియా ప్రతినిధి** .మండలంలో వ్యవసాయ సహాయ సంచాలకులు కార్యాలయం నందు మంగళవారం జరిగిన సమావేశంలో ఎరువుల ఇంటిగ్రేషన్ సరఫరాలో ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా రాబోయే ఖరీఫ్ సీజన్లో పంటల సరళని బట్టి మరియు రైతుల యొక్క ఆధార్ నంబర్ నమోదు చేసిన తర్వాత గతంలో నమోదు చేసిన పంటను బట్టి విస్తీర్ణం బట్టి ఎరువులు విక్రయాలు యాప్ ద్వారా జరుగుతాయని మండల వ్యవసాయ అధికారి చోడవరం పావని ఎలమంచిలి వ్యవసాయ సబ్ డివిజన్లో ఉన్నటువంటి ఆర్ ఎస్ కె సిబ్బందికి సూచనలు జారీ చేశారు,ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మోహన్ రావు మాట్లాడుతూ రైతులకు ఎరువులు యాప్ మీద అవగాహన కార్యక్రమం పూర్తిస్థాయిలో అవగాహన చేపట్టాలని తద్వారా రాబోయే సీజన్లో చిన్న సన్నకారు రైతులకు మరియు పెద్ద రైతులకు ముఖ్యంగా యూరియా విషయంలో ఎటువంటి లోపాలు లేకుండా చూసుకోవలసిన బాధ్యత ఆర్ఎస్కే సిబ్బంది మీద ఉందని తెలియజేశారు, వ్యవసాయ సహాయ సంచాలకులు సుమంతా మాట్లాడుతూ ఎరువులు యాప్ గ్రామస్థాయిలో ప్రతి ఒక్క రైతు నమోదు చేసుకునే విధంగా ఉండాలని లేనియెడల ఆర్.ఎస్.కె సిబ్బంది మీద క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి అచ్యుతాపురం శంకర్ గోవింద్ ఆర్ఎస్కే సిబ్బంది ఎస్. రాయవరం,ఎలమంచిలి, రాంబిల్లి, మరియు అచ్చుతాపురం ఆర్ఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ ఇండియా
నిజం మా ఇజం

## ఎడిటోరియల్

### మళ్లీ టాప్ లో నిలిచిన జపాన్.. అసలు విషయం తెలిస్తే షాక్!

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వందేళ్లు దాటిన వారి సంఖ్య వేగంగా పెరుగుతోంది. 2026 గణాంకాల ప్రకారం, జపాన్ ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉంది. జపాన్‌లో ఏకంగా 1,20,000 మంది శతాధిక వృద్ధులు ఉండగా, అమెరికా 64,000 మందితో రెండో స్థానంలో ఉంది. చైనా, ఇండియా మరియు ఫ్రాన్స్ దేశాలు తర్వాతి స్థానాల్లో నిలిచాయి. మెరుగైన జీవన ప్రమాణాలే ఆయుష్షు పెరగడానికి ప్రధాన కారణమని నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు చూద్దాం..

**రికార్డు స్థాయిలో జపాన్ వృద్ధులు:**
ఆయురారోగ్యాల విషయంలో జపాన్ మిగిలిన ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోంది. తాజా లెక్కల ప్రకారం అక్కడ 1,20,000 మంది వందేళ్లు దాటిన వారు ఉన్నారంటే అది సామాన్యమైన విషయం కాదు. అక్కడ జనాభా తగ్గుతున్నా, ఉన్నవారు మాత్రం ఎంతో ఆరోగ్యంగా వందేళ్లు గడిపేస్తున్నారు. జపాన్ ప్రభుత్వం వృద్ధుల సంరక్షణ కోసం తీసుకుంటున్న ప్రత్యేక చర్యలు ఇందుకు ఎంతో దోహదపడుతున్నాయి.

**ఆహారమే అసలైన రహస్యం:**
జపాన్ ప్రజలు వందేళ్లు బ్రతకడానికి వారి తిండి అలవాట్లే పెద్ద కారణం. వారు ఎక్కువగా చేపలు, కూరగాయలు, సోయా మరియు గ్రీన్ టీ వంటి పోషక విలువలున్న ఆహారాన్ని తీసుకుంటారు. ముఖ్యంగా "హరా హచి బు" అనే పద్ధతిని పాటిస్తారు, అంటే కడుపు నిండా తినకుండా, 80 శాతం నిండినప్పుడే భోజనం ఆపేస్తారు. ఈ అలవాటు వారిని స్థూలకాయం, గుండె జబ్బుల నుండి రక్షిస్తుంది.

**చురుకైన జీవనశైలి మరియు వైద్యం:**
వృద్ధాప్యంలో కూడా జపాన్ వాసులు ఖాళీగా కూర్చోవడానికి ఇష్టపడరు. నడక, గార్డెనింగ్ లేదా చిన్నపాటి వ్యాయామాలు చేయడం వారి దినచర్యలో భాగం. ఎవరు కాళీగా కూర్చొని తినటానికి ఇష్టపడరు..అలాగే అక్కడ ఉండే యూనివర్సల్ హెల్త్‌కేర్ సిస్టమ్ వల్ల ప్రతి ఒక్కరికీ నాణ్యమైన వైద్యం అందుతుంది. జబ్బు వచ్చినప్పుడు కాకుండా, రాకముందే జాగ్రత్త పడే 'ప్రివెంటివ్ హెల్త్‌కేర్' మీద వారు ఎక్కువగా దృష్టి పెడతారు.

**ఇతర దేశాల పరిస్థితి ఇలా:**
జపాన్ తర్వాత అమెరికాలో 64,000 మంది శతాధిక వృద్ధులు ఉండగా, చైనాలో 39,000 మంది ఉన్నారు. మన దేశం ఇండియా విషయానికి వస్తే, 29,000 మంది వందేళ్లు దాటిన వారు ఉన్నారు. ఫ్రాన్స్‌లో కూడా దాదాపు ఇదే స్థాయిలో అంటే 29,000 మంది వృద్ధులు ఉన్నారు. ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల జనాభా పెరుగుతుండటం ఒకవైపు ఆనందదాయకమైనా, అది ఆయా దేశాల ఆర్థిక వ్యవస్థలకు ఒక సవాలుగా కూడా మారుతోంది. ముసలితనం అంటే భారంగా కాకుండా, ఎంతో ఉత్సాహంగా ఎలా గడపాలో జపాన్ వృద్ధులను చూసి నేర్చుకోవచ్చు. మంచి ఆహారం, నిరంతర శారీరక శ్రమ, మరియు మానసిక ప్రశాంతత ఉంటే ఎవరైనా శతాధిక వృద్ధులు కావచ్చు. గ్లోబల్ ఏజింగ్ పెరుగుతున్న తరుణంలో, మన ఆరోగ్యం పట్ల మనం కూడా ఇప్పుడే జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.

# పింక్ సాల్ట్ వాడుతున్నారా?.. అయితే ఈ విషయం తెలుసుకోండి!

- వైట్ సాల్ట్‌కు బదులుగా పింక్ సాల్ట్ వాడొద్దని నిపుణుల సూచన
- అయోడిన్ లోపాన్ని నివారించేందుకు వైట్ సాల్ట్ తప్పనిసరి
- పింక్ సాల్ట్‌లోని 84 ఖనిజాల వల్ల పెద్దగా ప్రయోజనం లేదని వెల్లడి
- వంటల్లో వైట్ సాల్ట్, సలాడ్లపై పింక్ సాల్ట్ వాడటం మేలు



రోజువారీ ఆహారంలో ఉప్పు చాలా ముఖ్యం. ఇది రుచిని పెంచడమే కాదు, శరీర పనితీరుకు కూడా అవసరం. ప్రస్తుతం మార్కెట్లో వైట్ సాల్ట్‌తో పాటు పింక్ సాల్ట్ కూడా బాగా ప్రాచుర్యం పొందింది. అయితే, వైట్ సాల్ట్‌ను పూర్తిగా పక్కనపెట్టి పింక్ సాల్ట్ వాడటం ఆరోగ్యానికి మంచిది కాదని పోషకాహార నిపుణురాలు దాజ్‌మీత్ హెచ్చరిస్తున్నారు. పింక్ సాల్ట్ వాడకం పెరిగాక థైరాయిడ్ సమస్యలు ఎక్కువయ్యాయని ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో తెలిపారు.
వైట్ సాల్ట్‌లో ఉండే అయోడిన్, థైరాయిడ్ గ్రంథి పనితీరుకు చాలా కీలకమని దాజ్‌మీత్ వివరించారు. అయోడిన్ లోపం వల్ల గాయిటర్ వంటి సమస్యలు వస్తాయని గుర్తుచేశారు. అంతేకాకుండా, వైట్ సాల్ట్‌లోని సోడియం శరీరంలో ద్రవాల సమతుల్యతను కాపాడటంలో, నరాల పనితీరులో, కండరాల సంకోచ వ్యాకోచాలలో ముఖ్య పాత్ర పోషిస్తుంది.పింక్ సాల్ట్‌లో 84 రకాల ఖనిజాలు ఉంటాయని ప్రచారం ఉన్నప్పటికీ, అవి చాలా స్వల్ప మోతాదులో ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. ఈ ఖనిజాల వల్ల చెప్పుకోదగ్గ ఆరోగ్య ప్రయోజనాలు ఉండవు. ఉదాహరణకు, ఒక వ్యక్తికి రోజువారీ పొటాషియం అవసరం తీరాలంటే సుమారు 1.7 కిలోల పింక్ సాల్ట్ తినాల్సి ఉంటుంది.సాధారణ ఉప్పులో ఉండే అడిటివ్స్ వద్దనుకునే వారికి పింక్ సాల్ట్ ఒక సహజ ప్రత్యామ్నాయం మాత్రమేనని, అంతకుమించి గొప్ప ఆరోగ్య ప్రయోజనాలు ఆశించవద్దని స్పష్టం చేస్తున్నారు. పూర్తిగా పింక్ సాల్ట్‌కు మారితే, అయోడిన్ కోసం సముద్రపు పాచి, పాలు, చేపలు వంటి ఇతర ఆహార పదార్థాలపై ఆధారపడాల్సి ఉంటుంది. అందుకే, వంటల కోసం వైట్ సాల్ట్, సలాడ్ల వంటి వాటిపై చల్లుకోవడానికి పింక్ సాల్ట్ వాడటం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# మిలమిలలాడే దంతాల కోసం... నేచురల్ గా...!

- రసాయనాలు లేకుండా సహజ పద్ధతుల్లో దంతాలను తెల్లగా మార్చుకోవచ్చు
- ఆయిల్ పుల్లింగ్ పద్ధతితో ప్లాక్, బ్యాక్టీరియాను తగ్గించవచ్చు
- బేకింగ్ సోడాను ఉపయోగించి దంతాలపై మచ్చలను తొలగించుకోవచ్చు
- కాఫీ, టీ, స్మోకింగ్ వంటి వాటికి దూరంగా ఉండటం ముఖ్యం
- ఈ పద్ధతులు సాధారణ బ్రషింగ్‌కు ప్రత్యామ్నాయం కాదని నిపుణుల సూచన



అందమైన నవ్వు కోసం దంతాలను తెల్లగా మార్చుకోవాలని చాలామంది ఆశిస్తారు. అయితే, మార్కెట్లో దొరికే ఉత్పత్తుల్లో రసాయనాలు ఉంటాయని ఆందోళన చెందుతారు. అలాంటి వారి కోసం కొన్ని సహజ పద్ధతులు అందుబాటులో ఉన్నాయి. ఆయిల్ పుల్లింగ్, బేకింగ్ సోడా వంటి వాటితో ఇంట్లోనే సురక్షితంగా దంతాలను తెల్లగా చేసుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు.

**సహజ పద్ధతులు ఇవే..**
భారతీయ సంప్రదాయ పద్ధతి అయిన ఆయిల్ పుల్లింగ్ నోటిలోని బ్యాక్టీరియాను తగ్గించి ప్లాక్‌ను నివారిస్తుంది. రోజూ కొబ్బరి నూనెతో ఇలా చేయడం వల్ల మంచి ఫలితం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అలాగే, వంట సోడా (బేకింగ్ సోడా) కూడా సహజమైన బ్లీచింగ్ ఏజెంట్‌గా పనిచేస్తుంది. నీటితో కలిపిన బేకింగ్ సోడా పేస్ట్‌తో వారానికి రెండుసార్లు బ్రష్ చేయడం వల్ల పళ్లపై మచ్చలు క్రమంగా తొలగిపోతాయి. హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను నీటితో కలిపి మౌత్‌వాష్‌గా వాడొచ్చు, కానీ దీనిని పరిమితంగా, జాగ్రత్తగా వాడాలి.

**నివారణ మార్గాలు**
దంతాలు పసుపు రంగులోకి మారకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. కాఫీ, టీ, రెడ్ వైన్ వంటి పానీయాలను పరిమితం చేయాలి. ధూమపానం, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి. చక్కెర ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలను తగ్గించడం వల్ల నోటిలో బ్యాక్టీరియా వృద్ధిని అరికట్టవచ్చు. పాలు, చీజ్ వంటి కాల్షియం అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం వల్ల దంతాల ఎనామెల్ బలపడుతుంది.
అయితే, ఈ సహజ పద్ధతులు ఎంతమాత్రం రోజూ చేసే బ్రషింగ్‌కు ప్రత్యామ్నాయం కాదని గుర్తుంచుకోవాలి. దంత వైద్యుల సూచనల ప్రకారం, రోజుకు రెండుసార్లు బ్రష్ చేయడం తప్పనిసరి. ఏవైనా దంత సమస్యలు ఉంటే నిపుణులైన వైద్యులను సంప్రదించడం ఉత్తమం

## స్పిల్ అలారం.. ఇది పాలు పొంగు వచ్చే టైంకు మిమ్మల్ని అలర్ట్ చేస్తుంది !




అప్పుడప్పుడు పాలను స్టవ్ మీద పెట్టి వేరే పనుల్లో మునిగిపోతుంటాం. కాసేపయ్యాక చూస్తే అవి పొంగి నేల పాలవుతాయి. అందుకే పాలు, టీ, కాఫీ లాంటివాటిని కాచేటప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలి. లేదంటే ఇలాంటి ప్రొటెక్టర్ గ్లాస్ డిస్క్ వాడాలి. దీన్ని దర్మో అనే కంపెనీ మార్కెట్‌లోకి తీసుకొచ్చింది. ఈ గ్లాస్‌ని స్టవ్ వెలిగించకముందే పాల గిన్నె అడుగు భాగంలో పెట్టాలి. పాలు మరిగే స్థాయికి చేరుకోగానే, ఈ డిస్క్ గిన్నెకు తగులుతూ ఒక రకమైన శబ్దం చేస్తుంది. దాంతో అప్రమత్తం అవుతాం.ఇది ఫిజిక్స్ సూత్రాల ఆధారంగా పనిచేస్తుంది. అన్ని రకాల వంట పాత్రలు, స్టవ్‌టాప్‌ల్లో వాడుకోవచ్చు. దీన్ని 1.25 సెంటీమీటర్ల మందంతో హైక్వాలిటీ గాజు పదార్థంతో తయారుచేశారు. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకోగలదు. మన్నికగా ఉంటుంది. దీన్ని మరుగుతున్న పాల గిన్నెలో నుంచి తీసిన తర్వాత 10 నిమిషాల పాటు చల్లారనివ్వాలి. ఆ తర్వాత డిటర్జెంట్‌తో శుభ్రం చేసి, ఎన్నిసార్లైనా వాడుకోవచ్చు.



## కారులో టిష్యూలను ఇలాంటి హోల్డర్‌లో పెట్టుకుంటే..

సాధారణంగా కారులో టిష్యూ బాక్స్‌ని డ్యాష్ బోర్డ్‌పై పెడుతుంటారు. కానీ.. జర్నీలో పెద్ద పెద్ద కుదుపులు వచ్చినప్పుడు అది పదే పదే ఎగిరి కింద పడుతుంటుంది. అందుకే టిష్యూలను ఇలాంటి హోల్డర్?లో పెట్టుకుంటే సరిపోతుంది. దీన్ని డిటాచీ అనే కంపెనీ తీసుకొచ్చింది. దీన్ని కారులోని సన్ వైజర్, సీటు వెనుక భాగం లేదా డోర్ ప్యాకెట్స్.. ఇలా ఎక్కడైనా క్లిప్ చేసుకోవచ్చు. అందుకోసం దీనికి ప్రత్యేకంగా రెండు బలమైన క్లిప్‌లు ఉంటాయి. ఎంత పెద్ద కుదుపులు వచ్చినా అవి ఊడిపోవు. ఇది ఇంటీరియర్‌కు కూడా కొత్త అందాన్ని తీసుకొస్తుంది. ప్రీమియం పీయూ లెదర్ మెటీరియల్‌తో తయారైన ఈ హోల్డర్? చాలాకాలం పాటు మన్నికగా ఉంటుంది. ధర 250 రూపాయలు.

# పెళ్లి ఆలస్యంతో సమాజాన్ని జయించినట్లేనా?



నటి కృతికా కమ్రా వివాహ బంధం – వ్యక్తిగత నిర్ణయాల పై ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. సాధారణంగా సమాజంలో వయసు రాగానే పెళ్లి చేసుకోవాలనే ఒత్తిడి ఉంటుంది. కానీ తాను 37 ఏళ్ల వయసులో వివాహం చేసుకోవడాన్ని సరైన నిర్ణయంగా అభివర్ణించారు. జీవితంలో ఆలస్యంగా పెళ్లి చేసుకోవడం వల్ల ఎంచుకున్న భాగస్వామి పట్ల, నిర్ణయం పట్ల సంపూర్ణమైన స్పష్టత ఉంటుందన్నారు. ఆ సమయంలో ఏం చేస్తున్నామో? బాగా తెలుస్తుందని విశ్లేషించారు. తన స్నేహితులందరికీ పదేళ్ల క్రితమే వివాహాలు అయిపోయాయని గుర్తు చేసుకుంటూ వారంతా ఓ రకమైన సామాజిక ఒత్తిడి వల్లే ఆ నిర్ణయం తీసుకున్నారని కృతిక అభిప్రాయపడ్డారు. అయితే కృతిక తల్లిదండ్రులు పెళ్లి విషయంలో ఎన్నడూ తనని ఒత్తిడి చేయలేదని దీంతో కావాల్సినంత సమయం దొరికిందన్నారు. కెరీర్ , వ్యక్తిగత జీవితంపై పూర్తి అవగాహన వచ్చిన తర్వాతే తాను వైవాహిక బంధంలోకి అడుగుపెట్టానని ఇది తనకు ఎంతో మానసిక తృప్తిని ఇస్తుందన్నారు. గౌరవ్ కపూర్ – కృతికల వివాహం ఎంతో నిరాడంబరంగా కేవలం సన్నిహితుల మధ్య జరిగింది. భారీ హంగులు, డెస్టినేషన్ వెడ్డింగ్ వంటి ఆర్భాటాలకు తాము దూరంగా ఉన్నామన్నారు. –మాకు పెళ్లి వేడుక కంటే వివాహ బంధం అనేది చాలా పెద్ద విషయం అని స్పష్టం చేశారు. లోకానికి చూపించుకోవడానికి చేసే ఖర్చు కంటే ఇద్దరు వ్యక్తులు కలిసి జీవితాన్ని పంచుకోవాలనే ఉద్దేశం బలంగా ఉండాలని కృతిక అభిప్రాయపడ్డారు. అయితే పెళ్లి సమయంలో తన భర్త గౌరవ్ కపూర్ ఎంతో భావోద్వేగానికి లోనయ్యారని కృతిక గుర్తు చేసుకున్నారు. నిత్యం వందలాది మంది ముందు లైవ్ షోలు ఇచ్చే గౌరవ్, తమ వివాహ సమయంలో కన్నీళ్లు పెట్టుకోవడం తనను ఆశ్చర్యపరిచిందన్నారు. కృతికను వధువు రూపంలో చూడగానే గౌరవ్ కళ్లలో నీళ్లు తిరగడం, ఆ బంధం పట్ల ఆయనకున్న గౌరవానికి నిదర్శనమని ఆనందం వ్యక్తం చేశారు.తన ప్రాణ స్నేహితుడిని భర్తగా పొందడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పెళ్లి అనేది వ్యక్తిగత నిర్ణయమని అది ఎప్పుడు చేసుకోవాలనేది సదరు వ్యక్తులే నిర్ణయించుకోవాలని కృతిక సూచించారు. వయసును బట్టి కాకుండా మానసిక సిద్ధతను బట్టి అడుగు వేయాలని ఆకాంక్షించారు. ప్రస్తుతం తన కెరీర్‌లో వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూనే మరోవైపు వైవాహిక జీవితాన్ని ఎంతో సంతోషంగా గడుపుతున్నానన్నారు. పెళ్లి ఆలస్యంగా చేసుకోవడం అంటే సమాజాన్ని ఓడించినట్లు కాదు. సమాజపు అసంబద్ధమైన ఒత్తిడికి తలొగ్గకుండా ఉండటమే. జీవితానికి మనం యజమానులమని, మన నిర్ణయాలు మనం తీసుకోగలమని నిరూపించడమే అసలైన విజయం. ఇది ప్రతి ఒక్కరి వ్యక్తిగత ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. వయసుతో సంబంధం లేకుండా ఇద్దరు వ్యక్తులు ఒకరినొకరు గౌరవించుకుంటూ కలిసి ఉండాలని నిర్ణయించుకున్నప్పుడే ఆ వివాహం విజయవంతం అవుతుంది.



జాక్వెలిన్ ఫెర్నాండెజ్ లేస్ మరియు పెర్ల్స్‌లో సొగసుగా, అభిమానులను విస్మయానికి గురి చేసింది



క్లాసిక్ ఆఫ్-వైట్ చీర లుక్‌లో ప్రగ్యా నాగ్రా స్టన్స్

# చరణ్ కోసం సీక్రెట్ డైరెక్టర్ ఎవరు?



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం తన ప్లానింగ్‌తో టాలీవుడ్‌ను ఆశ్చర్యపరుస్తున్నారు. జూన్ 4న 'పెద్ది' సినిమా విడుదల కాబోతుండటంతో అందరిలోనూ ఆసక్తి మొదలైంది. అయితే దీని తర్వాత సుకుమార్ సినిమా కంటే ముందే చరణ్ ఒక క్విక్ ప్రాజెక్ట్ చేయబోతున్నారనే వార్త ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై నాగవంశీ ఈ సినిమాను నిర్మించబోతున్నారు.

ఇప్పటికే చరణ్ దీని కోసం డేట్స్ కూడా కేటాయించారని తెలియడంతో, అసలు ఆ సీక్రెట్ డైరెక్టర్ ఎవరు అన్నది ఇప్పుడు పెద్ద సస్పెన్స్‌గా మారింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలో ఈ మధ్య కాలంలో చాలా మంది కొత్త దర్శకులతో పాటు సీనియర్ దర్శకులు కూడా పనిచేశారు. నాగవంశీ వద్ద ప్రస్తుతం హిట్ ట్రాక్‌లో ఉన్న దర్శకుల లిస్ట్ గట్టిగానే ఉంది. అయితే చరణ్ లాంటి భారీ స్టార్ ఇమేజ్ ఉన్న హీరోకి ఎవరిని సెట్ చేస్తారనేది ఆసక్తికరంగా మారింది. నాగవంశీ ఇప్పటికీ రకరకాల కథలు వింటున్నారా లేక ఇప్పటికే ఒకరిని ఫిక్స్ చేసి రహస్యంగా ఉంచుతున్నారా అన్నది అంతుచిక్కడం లేదు. అయితే గౌతమ్ స్టైల్ ఆఫ్ మేకింగ్ మీద నాగవంశీకి గట్టి నమ్మకం ఉంది. అందుకే ఇప్పుడు మళ్ళీ గౌతమ్ తోనే తన శైలికి భిన్నంగా చరణ్ కోసం ఏదైనా కొత్త స్క్రిప్ట్ సిద్ధం చేయిస్తున్నారా అనే చర్చ ఫిలిం నగర్ లో గట్టిగా వినిపిస్తోంది. గతంలోనే చరణ్, గౌతమ్ కాంబినేషన్ లో ఒక సినిమా రావాల్సి ఉన్నా కొన్ని కారణాల వల్ల అది సెట్ కాలేదు.

ఇక ఏడాది క్రితం నాగవంశీ నిర్మాణంలో వచ్చిన 'కింగ్ డమ్' సినిమా ఆశించిన స్థాయిలో ఆడలేదు. ఆ సినిమాకు గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహించారు. ఒకవేళ చరణ్ మళ్ళీ గౌతమ్ వైపే మొగ్గు చూపితే అది ఖచ్చితంగా ఒక డిఫరెంట్ క్రేజీ ప్రాజెక్ట్ అవుతుంది. అయితే నాగవంశీ ప్లానింగ్ ప్రకారం ఇది చాలా వేగంగా పూర్తి చేసే సినిమా కావాలి. ఎందుకంటే జూన్ నుంచి సుకుమార్ సినిమా (=జ17) పనులు కూడా మొదలుకాబోతున్నాయి. ఈ గ్యాప్ లోనే చరణ్ చిన్న సినిమాను కంప్లీట్ చేయాలని చూస్తున్నారు.

దర్శకుడు ఎవరైనా సరే, సితార సంస్థ నుంచి వచ్చే ఈ అఫీషియల్ అప్ డేట్ కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. 2026 సంవత్సరం రామ్ చరణ్ కెరీర్ లో చాలా బిజీగా ఉండబోతోంది. 'పెద్ది' రిజల్ట్ తర్వాత చరణ్ చేయబోయే ఈ క్విక్ ప్రాజెక్ట్ ఆయన ఇమేజ్ కు ఎలా ప్లస్ అవుతుందో చూడాలి. నాగవంశీ తన సీక్రెట్ డైరెక్టర్ పేరును ఎప్పుడు బయటపెడతారో కానీ, ఈ లోపే రకరకాల పేర్లు తెరపైకి వస్తున్నాయి. ఆ దర్శకుడు ఎవరనేది మరికొన్ని రోజుల్లో తేలిపోయే అవకాశం ఉంది.

Printed, Published and Owned by VENKATESHWARLU VUPPALA, Printed at KRK Printers #2-3-703, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana- 500013, Published at # 502, Kubera Towers, Narayanaguda, Hyderabad, Telangana -500029, Editor : VENKATESHWARLU VUPPALA, RNI NO: TELTEL/2021/81802, CELL NO: 8125551235, newsindiatelugudaily@gmail.com